# అనురాగం

- అమ్మిన శ్రీనివాసరాజు

సాయంత్రం ఐదు దాటింది. ఆఫీసులు తలుపులు మూసుకుని విశ్రాంతి తీసుకుంటున్నాయి. పగలంతా శారీరకంగా, మానసికంగా కష్టాలు చేసిన కార్మికులు ఇంటిముఖం పట్టారు. కొందరు తమ పిల్లలకు తినుబండారాలు తీసుకుంటుంటే, మరికొందరు కొత్తగా పెళ్లయిన వాళ్లు భార్యలకు మల్లెపూలు బేరమాడుతున్నారు. పగలంతా శ్రమ చేసి ఆ శ్రమనంతా హాయిగా మర్చిపోవడానికి అనుకూలమైనది ఇల్లే కాబట్టి తమ తమ భార్యాపిల్లలతో ఆనందంగా గడపాలని ఆరాటపడుకుంటూ ఎవరి ఇళ్ల దార్లు వాళ్లు పడుతుంటే ఒక పక్క మనోవ్యథతో ఇంటి సమస్యలతో సతమతమయ్యే నిరాశాపరులు తాత్కాలిక ఆనందం పొందడానికి బారు షాపుల వైపు నడక సాగిస్తున్నారు.

ఆఫీసులో పని అయిందనిపించాడు చక్రవర్తి. కానీ మనసంతా ఇంట్లోనే వుంది. గత కొద్దిరోజులుగా తమ దాంపత్యంలో చెలరేగుతున్న సుడిగాలి గురించి సుదీర్ఘంగా ఆలోచిస్తూ, నడుస్తూ పక్కనే వున్న పార్కు వైపు దారితీశాడు. ఎదురుగా ఖాళీగా కనిపిస్తున్న సిమెంట్ బెంచీ మీద చతికిలబడ్డాడు. మనసులో సుడులు తిరుగుతున్న ఆలోచనలతో లేని ప్రశాంతాన్ని లాగిపుచ్చుకుంటూ... అలా ఆకాశంలోకి చూస్తూ... ఆలోచనల మేఘాలపై గతంలోకి తొంగిచూశాడు.

పెళ్లయిన కొత్తలో ఎంతో అన్యోన్యంగా ప్రాణానికి ప్రాణంగా వుండే తన భార్య సృజనలో గత కొద్దిరోజులుగా ఊహించని మార్పు... ఎదురింట్లో కొత్తగా చేరిన కాలేజీ స్టూడెంట్ గోపి మాటిమాటికి ఏదో వంకతో తమ ఇంటికి వస్తున్నాడు. సృజన-గోపిల మధ్య పరిచయం బాగా పెరిగింది. ఇద్దరి మధ్య చనువు పెరిగింది. తనులేని సమయాల్లోనే!! ఎప్పుడూ ఏదో మాట్లాడుకోవడం, నవ్వుకోవడం... తనను చూడగానే వాడు వెళ్లిపోవడం... ఇదంతా చూస్తుంటే ఏదో తెలియని అనుమానం చిరుముల్లులా తన మనసును బాధిస్తోంది. కానీ తను అలాంటిది కాదే. తనకెపుడూ అసంతృప్తి కలిగించదు! ఏది ఏమైనా సృజన-గోపిల అన్యోన్యం గురించి తన మనసుకు సమాధానం చెప్పలేకపోతున్నాడు చక్రవర్తి.

ఏమో! ఎవరు చెప్పారు? ఆడవాళ్లు సున్నిత మనస్కులు. ఎవరు ఏది చెబితే అదే నమ్మేస్తారు. ఆకర్షణలకు ఇట్టే లొంగిపోతారు. వాడు అసలే చదువుకుంటున్నవాడు. ఏవో మాయమాటలు చెప్పి సృజన మనసు మార్చేస్తే...? అసలే ఈమధ్య తను కంపెనీ పనుల మీద క్యాంపులకెళ్లడం ఎక్కువైంది. ఇంటి దగ్గర గడపడం కుదరడం లేదు. ఇంకేమైనా వుందా! ఎంతో గౌరవంగా బ్రతికిన కుటుంబం నలుగుర్లో తలెత్తుకోగలనా!? ఇలా పరిపరివిధాల ఆలోచించుకుంటూ మెదడు మొద్దుబారిపోతోంది. ఎలా అయినా ముందు వాణ్ణి ఆ ఇంట్లోంచి ఖాళీ చేయించాలి. ఏదో ఒకటి చేయాలి- అనుకున్నాడు చక్రవర్తి. మనసులో ముసురుతున్న మబ్బుల్ని ఛేదించుకోవడానికి లేని అలవాటును సహితం చంకనేసుకుని దగ్గర్లో వున్న 'బార్‌షాప్' కెళ్లాడు. అక్కడ దొరికిన 'కలియుగ అమృతాన్ని' కళ్లు మూసుకుని తాగేసి నిస్సహనంగా, నీరసంగా ఇల్లు చేరుకున్నాడు.

❖ ❖ ❖

టేబుల్ మీద ఓ తెల్ల కాగితం. దానిమీద అక్షరాలు. అవి సృజనవే!

'చక్రవర్తి గారికి... నేను ఇంతవరకూ మీకు తాళికట్టిన భార్యను. ఇకనుంచి మాత్రం కాదు. ఇకనుంచి మీ దారి మీది, నా దారి నాది. మీకూ, నాకూ ఎలాంటి సంబంధం లేదు. నాకు నచ్చిన,




నేను మెచ్చిన గోపీనే ఇకనుంచీ నాకు సర్వస్వం. మీకు అర్థమయ్యే వుంటుంది. ఇంతకుమించి వివరంగా వ్రాయలేను. ఇట్లు... సృజన'

అనుకున్నదంతా అయింది. ఏదైతే జరగకూడదని భావించానో అదే జరిగింది. నేనూరుకోను. నా సృజన నాకే దక్కాలి. ఇంకెవరికీ దక్కకూడదు. తనదికాని సృజన ఈ లోకంలో వుండడానికి వీల్లేదు. అవసరమైతే జైలుకైనా వెళతాను కానీ సృజనని ప్రాణాలతో పరాయివాళ్లపాలు చేయను- అనుకున్నాడు. వంటింట్లో కూరలు కోసే వాటమైన కత్తిని కుదురుగా ప్యాంట్ జేబులో పెట్టుకున్నాడు.

'వాళ్లు ఈ ఊళ్లో ఎక్కడా వుండరు... వుండలేరు... వేరే ఊరికి ప్రయాణమై వుంటారు. సృజన తనను అడక్కుండా పది రూపాయలు కూడా ముట్టుకోదే! ఊరి ప్రయాణానికి తన దగ్గరే డబ్బుండాలనేముంది. వాడి దగ్గరుండొచ్చు కదా!' అనుకుంటూ బస్టాండ్ వైపు వరుగు ప్రారంభించాడు.

తన ఆలోచన నిజమైంది. అక్కడే బెంచిమీద ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు.

'దొరికిపోయారు. ఇక తప్పించుకుని ఎక్కడకూ వెళ్లలేరు. ఒకే కత్తితో ఇద్దరినీ పొడిచెయ్యాలి. ఎవర్ని ముందు పొడవాలి?! సృజననే. తాళికట్టిన తనను కాదని చదువుకుంటున్నాడని, తనకన్నా అందంగా వున్నాడని, తనను, తన కుటుంబాన్ని

అప్రదిష్టపాలు చేసి పరాయివాడితో లేచిపోతున్నదాన్నే ముందు పొడిచెయ్యాలి. పెళ్లయిందని కూడా చూడకుండా కళ్లు మూసుకుపోయి, అందం చూసి ఆశపెట్టి అమాయకురాలైన తన అందాల సృజనని మాయమాటలతో మభ్యపెట్టి సంసారాన్ని ముక్కలు చేసి కళ్లముందే తన సృజనని తీసుకుపోబోతున్న ఈ కసాయివాడ్నే ముందు పొడిచెయ్యాలి. లేదు... లేదు... ఇద్దర్నీ ఒకేసారి ఒకే దెబ్బతో పొడిచెయ్యాలి. కానీ... ఎలా!? ఎప్పుడూ చేయని పని ఒకేసారి ఇద్దర్నీ పొడిచి చంపెయ్యాలి. చెయ్యి వణుకుతోంది. చెమటలు పడుతున్నాయి. లాభం లేదు. వదలకూడదు. ఎలా అయినా చంపెయ్యాలి. ఆలస్యం చేస్తే బస్సు వచ్చేయవచ్చు. అప్పుడు ఇంకేం చేయలేం! ఆలోచించాల్సిన సమయం కాదిది. ముందునుంచి వెళితే తనను చూసి పారిపోతే? పథకం పాడయిపోతుంది. వెనుక నుంచే వేటు వెయ్యాలి. వెనుక నుంచి అయితే ఛస్తారా!? ఈ సమయంలో గన్ వుంటే బాగుండును. పిట్టల్ని కాల్చినట్లు కాల్చేద్దును. అయినా వీళ్లను వదిలే సమస్యే లేదు. ఎలా అయినా సరే చంపెయ్యాలి. కామంతో కళ్లు మూసుకుపోయి ఇలాంటి పొరపాట్లు చేసే వాళ్లందరికీ ఈ జంట హత్యతో కనువిప్పు కావాలి. అందుకు నేనే శ్రీకారం చుట్టాలి' అనుకుంటూ కసితీరా పొడవబోయి... పరుపు మెత్తగా తగలడంతో గబుక్కున కళ్లు తెరిచాడు చక్రవర్తి.

❖ ❖ ❖

తలంటుకుని నీళ్లారకట్టుకున్న జుట్టుతో, నుదుట సింగార్ కుంకుమతో సింగారించుకుని, ముదురాకుపచ్చ చీరలో ముచ్చటగా ముసిముసి నవ్వులతో మంచం వైపు వస్తూ- 'అబ్బబ్బా తెల్లారి ఎంతసేపైంది? ఆఫీసుకు సెలవైనంత మాత్రాన పెందలాడే లేవకూడదా? రాత్రి ఏంటి ఏదోలా కనిపించారు? మీరు ఈమధ్య ఏదోలా వుంటున్నారు. ఆరోగ్యం సంగతి చూసుకోనక్కర్లేదా!?' అంటూ ముద్దుగా కసిరింది సృజన.

అంతలోనే ఎదురింట్లోంచి గోపీ వచ్చాడు.

'వచ్చావా...! రా! నేనే వద్దామని అనుకుంటున్నారా! రా...! ఇలా వచ్చి ఇక్కడ కూర్చో...' అంటూ సోఫా చూపించింది సృజన.

'నేనే వద్దాం అనుకుంటున్నారా!' ఆ మాట చక్రవర్తి చెవులకు ఆశ్చర్యం కలిగించింది.

'ఆఁ అన్నట్లు మా గోపీ గురించి మీకు చెప్పనేలేదు కదూ. చెబుదామన్నా వినడానికి తమరికి తీరికెక్కడుంది. ఎప్పుడూ ఆఫీసనే ఆ రెండో పెళ్లాంతోనే సరిపోతుంది కదా! తీరుబడిగా ఎక్కడ దొరుకుతారు. అయినా ఈమధ్య ఏదోలా వుంటున్నారు. ఆఫీసులో ఇన్‌స్పెక్షన్‌గానీ వుందా?!' అంటూ గుక్కతిప్పుకోకుండా చెప్పుకుపోతోంది.

'ఇంతకీ గోపీ... మీ గోపీనా!?' ఆశ్చర్యాన్ని రెట్టిస్తూ అడిగాడు.

'ఔను. గోపీ నాకు తమ్ముడు వరసవుతాడు. మా అమ్మ మేనబావ గారి అబ్బాయి. వాళ్ల ఊళ్లోని కాలేజీలో తను చదవాలనుకున్న కోర్సు లేదని ఇక్కడ కాలేజీలో చేరాడు. మనింట్లోనే ఉండమన్నాను. కానీ వాడే వేరే రూమ్ తీసుకుంటానన్నాడు. వాడు కూడా ఎప్పుడూ మీతో మాట్లాడలేదు. కొత్తవాళ్లతో, పెద్దవాళ్లతోనూ మాట్లాడాలంటే వాడికి భయం, సిగ్గు, మొహమాటం. ఏదో సమయం చూసి మీకు చెబుదామనుకున్నాను గానీ కుదిరింది కాదు' అంది సృజన.

అసలు విషయం తెలియక సాధారణ మగబుద్ధితో అన్యథా భావించి మనసుకు కమ్మిన అనుమానపు మబ్బులను పారద్రోలిన రాఖీ పౌర్ణమికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ శరీరాన్ని ఆవరించిన అనుమానపు వాసల్ని వాషింగ్ చేసుకోవడానికి వడివడిగా లేచాడు చక్రవర్తి. ఆత్మీయతానురాగాలకు, సోదర భావాలకు అనుబంధమైన ముచ్చటగొలిపే రాఖీని గోపీ ముంజేతికి ఒద్దికగా కట్టింది సృజన. ●

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.